అదిరెను బడి

- 'నాడు–నేడు'తో ముస్లిం తాటిచెట్లపాలెం ఉర్దూ పాఠశాలకు మహర్దశ
- రూ.23.34 లక్షలతో ఆధునికీకరణ
- తరగతి గదుల పెంపు, సౌకర్యాల కల్పన
- స్మార్ట్ క్లాసుల బోధన
- విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం



వందేళ్ల చరిత్ర గల ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఉర్దూ పాఠశాలకు మహర్దశ పట్టింది. సర్కారు బడులకు జవసత్వాలు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్ప బలంతో చదువులమ్మ కోవెల సకల సదుపాయాలతో చక్కగా ముస్తాబైంది. గత టీడీపీ పాలనలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన ఉర్దూ పాఠశాల.. నాడు–నేడు అభివృద్ధి పనులతో రూపురేఖలు మారి కళకళలాడుతోంది.


ఆహ్లాదకరంగా పాఠశాల ప్రాంగణం

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో 1918 నవంబర్ 21న ఉర్దూ పాఠశాలను ప్రారంభించారు. 2017 జనవరిలో జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. నాడు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో తరగతి గదులు సరిపోక, టాయిలెట్లు, తాగునీరు, నిరంతర నీటి సరఫరా లేక విద్యార్థులు అవస్థల పాలయ్యారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక ప్రవేశపెట్టిన మన బడి నాడు–నేడు కార్యక్రమంతో ఈ పాఠశాలకు అన్ని మౌలిక వసతులు సమకూరాయి.


నాడు-నేడు నిధులతో నిర్మించిన అదనపు భవనం

కార్పొరేట్ లుక్


డెస్క్ బెంచీలపై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

నాడు-నేడు పనుల వివరాలు

నిరంతర నీటి సరఫరా కోసం చేసిన ఖర్చు :	రూ.44,000
విద్యుత్ పనులు :	రూ.1,46,000
గ్రీన్ చాక్‌బోర్డ్స్ :	రూ.75,885
ఆర్వో ప్లాంట్ :	రూ.1,25,000
డెస్క్ బెంచీలు :	రూ.1,33,000
పెయింటింగ్, వాల్ ఆర్ట్ :	రూ.2,30,000
టైల్స్ :	రూ.45,000



నేడు : ఆధునికీకరించిన జీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల (ఇన్‌సెట్) నాడు : అభివృద్ధికి నోచుకోని ముస్లిం తాటిచెట్లపాలెం ఉర్దూ పాఠశాల

నాడు–నేడు మొదటి ఫేజ్‌లో పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.23.34 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, వెట్రిఫైడ్‌టైల్స్‌తో ఫ్లోరింగ్, గ్రీన్‌బోర్డులు, టాయిలెట్ల ఆధునికీకరణ, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, నిరంతర నీటి సరఫరా, ఆర్వో వాటర్, యాంటీస్కిడ్ టైల్స్‌తో స్కూల్ ప్రాంగణం, ఆకట్టుకునేలా స్కూల్ ప్రవేశ ద్వారం, నేమ్ బోర్డు, వాల్ ఆర్ట్, పెయింటింగ్‌తో కార్పొరేట్ లుక్ కల్పించారు.

ఉర్దూ పాఠశాల విశేషాలు

2019లో విద్యార్థుల సంఖ్య : 180	ఐఎఫ్‌పీ ప్యానల్స్ : 2
ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య : 380	స్మార్ట్ టీవీలు : 4
తరగతి గదుల సంఖ్య : 8	స్టాఫ్ రూమ్ : 1
ఇంగ్లిష్ ల్యాబ్ : 1	అంగన్‌వాడీ : 1
	బోధనా సిబ్బంది : 11
	ఆయాలు : ఇద్దరు

పాఠశాల స్వరూపం మారింది



గతంలో పాఠశాలలో సరైన సదుపాయాలు లేక ఇబ్బంది పడేవారం. భవనం పాతది కావడంతో శ్లాబు లీకై, గోడలు చెమ్మలు పట్టి ఉండేవి. తరగతి గదులు, డెస్క్ బెంచీలు సరిపోయేవి కాదు. నిరంతర నీటి సరఫరా లేక విద్యార్థులు టాయిలెట్‌కి వెళ్లాలంటే ఇబ్బంది పడేవారు. మన బడి నాడు–నేడుతో మా పాఠశాల స్వరూపమే మారిపోయింది. అన్ని వసతులు సమకూరాయి. దీంతో అడ్మిషన్లు పెరిగాయి.

– పి.శాంతికుమారి, హెచ్‌ఎం, ఉర్దూ స్కూల్

జగనన్నకు కృతజ్ఞతలు



మా ఇద్దరు పిల్లలు చిన్నప్పటి నుంచి ఉర్దూ స్కూల్‌లో చదువుతున్నారు. గతంలో ఎటువంటి సదుపాయాలు ఉండేవికాదు. ఉర్దూ బోధించే పాఠశాల కావడంతో ఇక్కడ చదివించాల్సి వచ్చేది. జగనన్న వచ్చాక స్కూల్ స్వరూపమే మారింది. పెద్ద పెద్ద స్కూల్స్‌లో, మా ఇంట్లో కూడా లేని సదుపాయాలు కల్పించారు. టాయిలెట్లు, ఆర్వో వాటర్, డెస్క్ బెంచీలు, తరగతి గదులు అన్నీ చక్కగా అమర్చారు.

– హసీనా బేగం, విద్యార్థుల తల్లి

స్మార్ట్ క్లాసులు వింటున్నాం



మా ఉర్దూ పాఠశాలలో పాఠశాల నిరంతర నీటి సరఫరా లేక ఒకప్పుడు స్కూల్‌లో టాయిలెట్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. సరైన విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు ఉండేవి కాదు. జగన్ మామ వచ్చాక మా స్కూల్‌లో అన్ని సదుపాయాలు వచ్చాయి. ఇపుడు ఐఎఫ్‌పీ సాయంతో స్మార్ట్ క్లాసెస్ చక్కగా వింటున్నాం. చాలా ఆనందంగా ఉంది.

– తోబా, విద్యార్థిని

క్లుప్తంగా

'స్పందన'కు 15 అర్జీలు


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనంద్ కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు, కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిర ప్రాంగణంలోని నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ధ్యాన మందిర కమిటీ సభ్యులు, బాబా భక్తులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి పాశుర విన్నపం


ఆలయ ప్రదక్షిణలో శేషాచార్యులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 4.30 గంటలకు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా భక్తుల సమక్షంలో ఆలయ ప్రదక్షిణ జరిగింది. అనంతరం తిరుప్పావై రెండో పాశుర విన్నపాన్ని శ్రీరంగనాథుడికి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్, అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి కల్పించండి

తాటిచెట్లపాలెం: ఉచితాలు వద్దు.. ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైల్వేస్టేషన్ వద్ద ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.వామన మూర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు ప్రజలకు మోసపూరిత హామీలిస్తున్న రాజకీయ పార్టీలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ తరహాలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, ఆడపిల్లలకు నగదు ఇస్తామంటూ హామీలను వచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు. వీటికి బదులుగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని, ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం బురుజుపేట కనక మహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం


నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో పూజలందుకున్న సుబ్రహ్మణ్య స్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


సీతంపేటలో సుబ్రహ్మణ్య స్వామి ఊరేగింపు


అక్కయ్యపాలెంలో సుబ్రహ్మణ్యస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవం సోమవారం ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. 24వ వార్డు నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అర్చకులు రామారావు శర్మ, మహేష్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ఆవరణలోని నాగదేవతలకు భక్తులు పూజలు జరిపారు. సాయంత్రం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

- నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ కమిషనర్ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్మాణ దాతలు వాసుదేవ వర్మ, భార్య జ్యోతి మొదటి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పైలా శేఖర్‌బాబు, ధర్మకర్తల మండలి చైర్మన్ నక్క అప్పలరెడ్డి, సభ్యులు, సిబ్బంది వనజాక్షి, శివ, స్వామి బృందం వనజాక్షి, అనురాధ, దుర్గా, వెంకటలక్ష్మి, గౌరి, భక్తులు పాల్గొన్నారు.


మాధవస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

కనుల పండువగా ఊరేగింపు

సీతంపేట: సీతంపేట పార్వతీశ్వరాలయంలో బాల మురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో 108 క్షీర కలశాలతో సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా జరిపారు. సాయంత్రం 108 దీప కలశాలతో స్వామి వారి ఊరేగింపు కనుల పండువగా జరిగింది.

- శ్రీగౌరీ సేవా సంఘం, జనసుధ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లో పుట్ట బంగారమ్మ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో విశేష పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం 108 కలశాలతో స్వామి వారి తిరువీధి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి జల, క్షీరాభిషేకాలు చేశారు.

కమనీయం.. కల్యాణం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవ స్వామి దేవాలయంలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సింహాచల దేవస్థానం పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు నేదునూరి శ్రీనివాస శర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి


55వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.కె.రాజు


50వ వార్డులో కిట్ అందజేస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

తాటిచెట్లపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 55వ వార్డు 261 సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసే డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కె.కె.రాజు మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కె.పి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, జేసీఎల్ మండల కన్వీనర్లు వసంతల అప్పారావు, వార్డు నాయకులు వై సిద్ధార్థరాజు, గంగామహేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, బద్రి సొండి సురేష్, ఆళ్ల గోపి, శివప్రసాద్, పోలరాజు, కరుణలక్ష్మి, నాగలక్ష్మి, అనురాధ, పద్మప్రియ, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, గృహసారథులు, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే రావాలి

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అన్నారు. 294 సచివాలయం పరిధి బిర్లా జంక్షన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, వార్డు నాయకులు బగాది విజయ్‌కుమార్, పి.సునీత, ఏవీఎన్ రాజు, పొన్నాడ అప్పారావు మాస్టారు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దివ్యాంగుల గుర్తింపు శిబిరాలు


విజయలక్ష్మి, జోన్-3 కమిషనర్

సీతమ్మధార: తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లో దివ్యాంగుల గుర్తింపు కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సోమవారం జీవీఎంసీ జోన్–3 కమిషనర్ జె.విజయలక్ష్మి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు పలు రకాల ఉపకరణాలను ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 20న రేసపువానిపాలెం స్వర్ణభారతి స్టేడియంలో, 23న లాసెన్స్ బే కాలనీలోని శాంతి ఆశ్రమం దరి ఓంకార్ బధిరుల పాఠశాలలో, 24న లాసెన్స్ బే కాలనీ కామత్ హోటల్ దరి బీజేపీ కార్యాలయంలో శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 22న పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో శిబిరం జరుగుతుందన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరాలకు దివ్యాంగులు ఆధార్ కార్డు, సదరం, యూడీఐ కార్డు, ఫొటోలు తీసుకురావాలని కోరారు. దివ్యాంగులు, స్వచ్ఛంద సంస్థలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలను అందిస్తామని జెడ్సీ విజయలక్ష్మి తెలిపారు.

24న హనుమత్ వ్రతం


శ్రీ ఆంజనేయ స్వామి

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 24వ తేదీ ఆదివారం హనుమత్ వ్రతం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పూజలో పాల్గొనే భక్తులు దేవస్థానం కౌంటర్ వద్ద రూ.216 చెల్లించి రసీదు తీసుకోవాలని కోరారు. వీరికి లడ్డు, పులిహోర ప్రసాదం, సింధూరం అందిస్తామన్నారు.

వేగవంతంగా రహదారి విస్తరణ పనులు


బర్మా క్యాంప్‌లో సమస్యలను కె.కె.రాజుకు వివరిస్తున్న అల్లు శంకరరావు

మురళీనగర్: రెండు వార్డులకు ఉపయోగపడేలా చేపడుతున్న రహదారి విస్తరణ పనులను తక్షణం పూర్తి చేయాలని అధికారులకు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు సూచించారు. గుడ్ మార్నింగ్ నార్త్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 48, 49 వార్డుల పరిధి ఊర్వశి జంక్షన్, బర్మా క్యాంప్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు, 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవితో కలిసి ఆయన పర్యటించారు. రూ.2.16 కోట్లతో ఊర్వశి జంక్షన్ నుంచి బర్మా క్యాంప్, శ్రీనివాసనగర్, మధుసూదన నగర్ వరకు నిర్వహిస్తున్న 40 అడుగుల రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలపై కె.కె.రాజు చర్చించారు. కార్యక్రమంలో డీఈ భరణి, టీపీవో విజయ్‌కుమార్, ఏఈలు మోహన్, రాధిక, సాయినాథ్, డైరెక్టర్ రాయుడు శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, కర్రి రామారెడ్డి, రాజాన గంగరాజు, భూలోక, రుత్తల రాంబాబు, అప్పారావు, పి.పద్మ, శంకర్, నరేష్, రాఘవులు, హేమంత్, జాన్సన్, భరత్, రాజేష్, సీహెచ్ శ్రీను, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అందరి సహకారంతో కాలుష్య నివారణ

డాబాగార్డెన్స్: మహా విశాఖ నగరంలో ప్రజలందరూ ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించాలంటే ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కోరారు. విశాఖ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ చేపట్టిన ప్రతి సోమవారం ప్రజా రవాణాను వినియోగించాలనే కార్యక్రమాన్ని తాను, జీవీఎంసీ యంత్రాంగం క్రమం తప్పకుండా ఆచరిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు విద్యుత్ ఆటోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వారానికి ఒక రోజు ప్రతి సోమవారం సైకిల్ లేదా ప్రజా రవాణా ద్వారా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

మన లక్ష్యం.. కాలుష్య రహిత విశాఖ

కాలుష్య రహిత విశాఖే మన లక్ష్యమని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎకో–జీరో పొల్యూషన్ నేపథ్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతూ ప్రతి ఒక్కరూ వారంలో సోమవారం తప్పకుండా ప్రజా రవాణాను వినియోగించాలనే జీవీఎంసీ పిలుపునకు తాను సైతమంటూ కమిషనర్ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నానాటికీ పెరుగుతున్న కాలుష్యం దృష్ట్యా, నగర పర్యావరణ పరిరక్షణ దిశగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు జీవించాలనే దృఢ సంకల్పంతో జీవీఎంసీ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజా రవాణాను వినియోగిస్తూ కాలుష్య రహిత విశాఖకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ఇంధన పొదుపుపై విద్యార్థినులకు పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

తాటిచెట్లపాలెం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా సోమవారం 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని కేఎస్‌ఎం గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులకు పలు పోటీలు ఏర్పాటు చేశారు. 7, 8, 9 తరగతుల పిల్లలకు ఇంధన పొదుపుపై డ్రాయింగ్, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. వీటిలో విజేతలైన ముగ్గురికి వారోత్సవాల ముగింపు రోజు 20వ తేదీన కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేస్తామని ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది తెలిపారు.